# చెల్లింపు

## శ్రీ రామదాస్ అమరనాథ్



ఆఫీసులో అందరూ తమ తమ పనులు చక చకా చేసుకుంటూ పోతున్నారు. ఎ.సి. రూంలో కుషన్ కుర్చీపై కూర్చున్న మేనేజర్ శ్రీనివాసరావు మనసు టేబిల్ పై ఫానుగాలికి రెపరెప లాడుతున్న కాగితాల దొంతరలా ఉంది.

ఆరోజు ఉదయాన్నే శ్రీమతితో తగాదా పడ్డాడు. పెద్దమ్మాయి పెళ్లి విషయం చర్చకు వచ్చింది. ''బాధ్యతలు పైన పడిన తరువాత కూడా జల్సాగా కాలంగడిపితే ఏం పనులవుతాయి?'' అన్న ఆమె మాటలకు ఆశ్చర్యంతో ''జయా! నేనునెలకి మూడు వేల రూపాయలు జీతం తీసుకునే మేనేజర్ని నిజమే కాని, శ్రీమంతుణ్ణి కాదు. ఈ రోజుల్లో మగపిల్లలకు ఉద్యోగం సమస్య ఎలా ఉందో ఆడ పిల్లలకి పెళ్లి సమస్య కూడా అలాగే ఉంది!'' అన్నాడు. ''అలాగయితే ఏమీ పట్టనట్టు కూర్చోండి. వచ్చే జన్మలో పెళ్లి చేద్దురుగాని!'' అంటూ విసురుగా వెళ్లింది. ఆ మాటలు శ్రీనివాసరావును పద్మవ్యూహంలా బంధించాయి.

స్రింగ్ డోర్ కిర్రు మంది. ''సార్! టెలిగ్రాం!'' అన్న టెలిగ్రాం మెసెంజర్ పిలుపుకు శ్రీనివాసరావు కళ్లు పెద్దవయ్యాయి.

''వాట్! టెలిగ్రామా ఎక్కడినుంచి?''

''జోనల్ ఆఫీస్ హైదరాబాదు నుంచి సార్!''

సీరియస్‌గా సంతకం చేసి తీసుకొని చదివిన తరువాత చాలా ఆశ్చర్యపోయాడు శ్రీనివాస రావు. ఆ నెలలోనే జరగబోతున్న క్లెరికల్ కేడర్ ఉద్యోగాల ఇంటర్‌వ్యూ బోర్డ్‌కి తనను చీఫ్‌గా ఎంపిక చేశారట. అదీ పెర్కిగాం సారాంశం. ఒక్క క్షణం శ్రీనివాసరావు హృదయం ఆనందంతో గెంతులు వేసింది. సీలింగ్ ఫాన్ వేగంతో ఆలోచనలు గిర్రున తిరిగాయి.

ఈ రోజు తను ఇలా ఈ స్థితికి చేరుకో గలిగాడంటే, దాని వెనుక తను చేసిన కృషీ, పట్టుదల, ఔదార్యం, ఏకాగ్రత ఏపాటివో తనకు మాత్రమే తెలుసు. చదువుకునే రోజుల్లో స్నేహితులతో ఎప్పుడూ డబ్బు దగ్గరే పేచీ వస్తుండేది. ఎక్కువగా డబ్బు ఖర్చు పెట్టని మనస్తత్వం తనది. అందుకే తరచు ఒంటరిగా ఉండేవాడు.

''ఒరేయ్ శ్రీనివాసరావూ! నీ పేరే శ్రీనివాసుడు. అందుకే డబ్బు విషయంలో నీకంత పిసినితనం. ఒరేయ్ బాబూ! మరీ అంత గట్టితనం ఉన్నా లాభం లేదురా! ఎందుకో తెల్సా?! ఎక్కువ మంది ఆడ పిల్లలు పుట్టా రనుకో, వాళ్లందరికి కట్నకానుకలివ్వలేక బాధ పడేది నువ్వు!'' అంటూ తనను ఆట పట్టించేవాళ్లు.

అక్షరాలా అంతే జరిగింది. కష్టపడి చదివి మంచి ఉద్యోగం సంపాదించాడు కానీ, వరుసగా ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. మేనేజరైనా, మినిస్టరైనా ఆడపిల్లల తండ్రిగా కనీస కష్టాలు ఎదుర్కోక తప్పదు. పెద్దమ్మాయి డిగ్రీ పాసయి మూడేళ్లయినా, సంబంధాలు చూడటం మొదలెట్టి రెండేళ్లయినా, తన జీతం మూడు వేలకు చేరుకున్నా, పెళ్లి మాత్రం చెయ్యలేకపోయాడు. ''వచ్చే జన్మలో పెళ్లి చేద్దురుగాని'' అన్న శ్రీమతి మాటలు తనను శూలాల్లా పొడుస్తున్నాయి.

ఫోన్ మోగింది. రిసీవర్ అందుకున్నాడు. ఆలోచనలన్నీ తలొక దిక్కు వెళ్లిపోయాయి.

''హలో! ఎవరూ!? ఎం.ఎల్.ఏ. గురునాధం గారా! నమస్కారం సార్!''

''.......................''

''ఆ! ఏమిటీ! హైదరాబాద్ నుంచి రాత్రి వచ్చారా! ......ఆ! అవును సార్! ......థాంక్యూ!సార్!''

''.................''

''ఆ! ఏమిటి! ఈరోజు సాయంత్రం అర్జంటుగా కలవమంటారా!...... అలాగే సార్!''

ఫోన్ క్రెడిల్లో పెట్టి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు శ్రీనివాసరావు. ''అప్పుడే తనను ఇంటర్‌వ్యూ బోర్డ్ చీఫ్‌గా సెలక్ట్ చేసిన విషయం కీలకమయిన వ్యక్తులకు తెలిసిం దంటే...... 'ఆపైన ఆలోచించలేదు శ్రీని వాసరావు.




** ** **

''చూడండి శ్రీనివాసరావుగారూ! మీరు అన్ని విషయాల్లోనూ పర్‌ఫెక్ట్ అనే విషయం నాకు బాగా తెలుసు...... అందుకే చెపు తున్నాను, ఈ సంవత్సరం మీ పెద్దమ్మాయి పెళ్లి మా అందరి ఆధ్వర్యంలో ఘనంగా చేసేద్దాం అని'' ఎం.ఎల్.ఏ. గురు నాధం గొంతు విచిత్రంగా ధ్వనించింది.

శ్రీనివాసరావు గురునాధం మొహంలోకి సూటిగా చూశాడు.

''అవును శ్రీనివాసరావుగారూ! ఈ ప్రపంచాన్నీ డబ్బే నడిపిస్తోంది. ఆడబ్బే భూమ్యా కాశాలను దగ్గర చేయగలదు! ఆ డబ్బే భూమిని ఆకాశాన్ని దూరంగా తోసేయగలదు......'' అంటూ నవ్వాడు గురునాధం.

''కానీ సర్.......'' అనబోతున్న శ్రీని వాసరావును చెప్పనివ్వకుండా.

''ఈ ఒక్క సహాయం చెయ్యండి! ఇరవై వేలు అ...క్ష...రా...లా......ఇ...ర...వై... వేలు...!'' అంటున్న గురునాథానికి ఎదురు చెప్పే శక్తి ఎలాంటిదో ఆక్షణంలో శ్రీని వాసరావు తెలియలేదు.

** ** ** ** **

కాలచక్రం రెండు సంవత్సరాలు ముందుకు తిరిగింది. ఈ మధ్యలో ఉద్యోగ రీత్యా రెండు చిల్లాలు ముందుకు వెళ్లాడు శ్రీనివాసరావు. జీతంలో రెండంకెలు మారాయి. కానీ, పెద్ద మ్మాయి పెళ్లి మాత్రం కాలేదు. సంవత్సరం నుంచి సంబంధాలు కూడా ఏమీ రాలేదు.

ఆ రోజు శ్రీనివాసరావు ఇంట్లో సందడి చోటు చేసుకుంది. సంవత్సరం తరువాత పెళ్లి చూపులనగానే ఎక్కడో ఆశా కిరణం అందరి లోనూ తళుక్కుమంది. ఆరోజు శెలవు పెట్టి ఇంట్లోనే ఉన్నాడు శ్రీనివాసరావు. 'అబ్బాయి పనిచేసేది తన డిపార్ట్‌మెంట్ సంబంధించిన దాంట్లోనే, చదువు ఫరవాలేదు. ప్రమోషన్ కోసం ట్రై చెయ్యవచ్చు. వాళ్ల కుటుంబ పరిస్థితి కూడా మంచి పలుకుబడి కలిగినదే ...... కట్నం యాభై వేలకు ఏమాత్రం తగ్గదు' ఆలోచనలు అతన్ని ముంచెత్తుతున్నాయి.

ఆ బజారులోని తెలిసిన ఆడవాళ్లు కొంత మంది కూడా రావటంతో ఇల్లంతా సందడిగా ఉంది. ఉత్సాహంతో ఘనంగా ఏర్పాటయ్యాయి పెళ్లి చూపులు.

సోఫాలో హుందాగా కూర్చున్న వరుణ్ణి పరి శీలనగా చూసిన శ్రీనివాసరావుకి గొంతులో వెలక్కాయ పడినట్లైంది. ఆశ్చర్యంతో కళ్లు రెపరెపలాడాయి. మాటలు పెగల్లేదు. రెండు సంవత్సరాల క్రితం ఇంటర్వ్యూలో చూసిన రూపం... అదే హుందాతనం. ఆ తరువాత గురునాధం చేసిన రికమండేషన్... ......! ''అక్షరాలా.........ఇరవైవేలు......!'' తల తిరిగి పోతోంది. ''యాభైవేలకి ఏమాత్రం తగ్గదు'' పరిసరాలేవీ కనిపించడంలేదు.

టేబిల్‌పై ఫాన్ గాలికి రెపరెపలాడుతున్న కాగితాల దొంతరలోంచి ఎగిరి పోయిన కాగి తంలా అయింది శ్రీనివాసరావు మనసు. ●